# వాస్తవం

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

మంగళవారం
10.02.2026

డెయిలీ.కామ్

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి


## 'సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..







# తెలంగాణకు బీజేపీ ఏం చేసింది?


## మూసీ నది అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిధులు తెచ్చారా?

## కేంద్రానికి సీఎం రేవంత్ సూటిప్రశ్న

**తెలంగాణలో ఏర్పడిన దరిద్రానికి కారణం బీఆర్ఎస్ పార్టీనే..బీఆర్ఎస్‌ను యాసిడ్‌తో కడిగినా.. ఆ దరిద్రం పోదంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఏనాడైనా సభకు వచ్చి ప్రజా సమస్యలు ప్రస్తావించారా?**

**హైదరాబాద్, ఫిబ్రవరి 09:** తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చెప్పాలంటూ ఆ పార్టీ అగ్రనేతలను సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రానికి ఏమైనా ప్రాజెక్టులు ఇచ్చిందా? అంటూ ఆ పార్టీ నేతలను సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారన్నారు. కానీ హామీల అమలు గురించి మాత్రం చెప్పట్లేదంటూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం. ఈ మేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉందన్నారు. భవిష్యత్తును ఆలోచించి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటూ ఓటర్లకు సూచించారు. మూసీ నది అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిధులు తెచ్చారా? అంటూ వారిని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కానీ లక్షల కోట్ల రూపాయలు ఇచ్చామని వారు చెబుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కూడా వారు తేలేదన్నారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణకు కేటాయించిన సెమీకండక్టర్ ప్రాజెక్ట్‌ను.. చివరి నిమిషంలో ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడితో పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌కు తరలించారంటూ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై సీఎం రేవంత్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర పన్నుల వాటా తప్ప కేంద్రం తమకు ప్రత్యేకంగా ఇచ్చిందేమిటో చెప్పాలంటూ బీజేపీ అగ్రనేతలను నిలదీశారు. ప్రతి రూపాయి ట్యాక్స్‌పై 42 పైసలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని గుర్తుచేశారు. కర్ణాటక రూ.16 పైసలు, తమిళనాడు రూ.26 పైసలు మాత్రమే ఇస్తున్నాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందంటూ కేంద్రంపై మండిపడ్డారాయన. కుంభమేళాకు వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తుంది. కానీ మేడారం జాతర, గోదావరి పుష్కరాలకు మాత్రం నిధులు ఇచ్చేందుకు ముందుకు రాలేదన్నారు. వరదలొచ్చినప్పుడు అదనంగా రూపాయి సాయం కూడా తెలంగాణకు చేయలేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బీఆర్ఎస్ నేతలు బరి తెగించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్ రెడ్డి. తెలంగాణలో ఏర్పడిన దరిద్రానికి కారణం బీఆర్ఎస్ పార్టీనేనని ఉద్ఘాటించారాయన. బీఆర్ఎస్‌ను యాసిడ్‌తో కడిగినా.. ఆ దరిద్రం పోదంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఏనాడైనా సభకు వచ్చి ప్రజా సమస్యలు ప్రస్తావించారా? అని కేసీఆర్ వ్యవహారశైలిని ఆయన తప్పు బట్టారు. ప్రభుత్వ సదుపాయాలు తీసు కుంటూ.. సభకు రారా? అంటూ బీఆర్ఎస్ అధినేతకు చురకలంటించారు. అలాంటి పార్టీకి ఓట్లు అడిగే అధికారం ఉందా? అని ఆ పార్టీ నేతలనుద్దేశించి ప్రశ్నించారు. ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసి నగదు వసూలు చేశారని సీఎం ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది విడదీయరాని బంధమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు, జీఎస్టీకి బీఆర్ఎస్ నేతలు మద్దతివ్వలేదా? అని ప్రశ్నించారు. పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చారంటూ బీఆర్ఎస్ నేతలపై ప్రశ్నల వర్షం కురిపించారు. రెండేళ్లలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో జిరాక్స్ సెంటర్లలో ప్రభుత్వ పరీక్షలకు సంబంధించిన పత్రాలు దొరికాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

# పాతాళంలో దాక్కున్నా వదలం




**హనుమకొండ, ఫిబ్రవరి 9 :** పాలన చేతగాక, ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, రాష్ట్రంలో రెండేండ్ల తర్వాత బీఆర్ఎస్ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. లక్కీ డ్రాలో ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డికి ఇంకా రెండేండ్లే ఉన్నదని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను, తమ పార్టీ కార్యకర్తలను ఏమైనా అంటే విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి దేవుండ్లకు మొక్కుకోవాలని, పాతాళంలో దాక్కున్నా విడిచిపెట్టబోమని స్పష్టంచేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, పోలీసులు అతి చేయొద్దని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిట్టడం తప్ప పాలన చేతకాదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ సోమవారం భూపాలపల్లి, పరకాల, మహబూబాబాద్ మున్సిపాలిటీల్లో రోడ్ షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లల్లో మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డికి ఏమీ తెలియదు. చరిత్ర అసలే తెలియదు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో పుట్టిన మహాకవి దాశరథిని నిజామాబాద్ వెళ్లి అక్కడ పుట్టాడని అన్నడు. ఉత్తర భారతదేశంలో హిమాచల ప్రదేశ్‌లోని భాక్రానంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉన్నదని స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా అన్నడు. బూతులు తిట్టడం తప్ప రేవంత్‌రెడ్డికి ఏమీ తెలియదు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత చిల్లరగా మాట్లాడలేదు. ఎన్టీ రామారావు, చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్‌ను ముఖ్యమంత్రులుగా చూసినం. ఇప్పుడు భూమికి మూడు ఫీట్లు ఉన్నోడు.. డైలాగ్‌లు మాత్రం (మిగతా5లో..)

- భూపాలపల్లి, పరకాల, మానుకోటలో కేటీఆర్ ప్రచారం
- రేవంత్.. నీకు రెండేండ్లే టైమ్! నెక్స్ట్‌వచ్చేది మేమే!
- కేసీఆర్‌ను తిడితే ఊరుకునే ప్రసక్తే లేదు
- బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్
- తెలంగాణలో ఎగురబోయేది గులాబీ జెండానే
- అనుముల రేవంత్ కాదు లాగుల తొండల్‌రెడ్డి
- హామీలపై కాంగ్రెస్‌ను గల్లాపట్టి అడుగుతం
- అమలు చేయకపోతే వీపు చింతపండు చేసుడే

## నరవణే పుస్తకం లీక్‌పై పోలీసు కేసు

**న్యూఢిల్లీ :** ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణే రచించిన అముద్రిత పుస్తకం సోషల్ మీడియాలో పంపిణీ కావడంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సోమవారం ఓ అధికారిక ప్రకటన వెలువడింది. ర క్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందని పుస్తకం మ ుద్రణకు నోచుకోలేదని, అలాంటి పుస్తకం ఇప్పుడు రాహుల్ గాంధీ చేతిలోకి ఎలా వచ్చిందని ఇండియా టుడే ప్రశ్నించిన కొన్ని గంటల్లోనే ఈ కేసు నమోదు కావడం గమనార్హం. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం ముద్రించడానికి అనుమతి లేదని, అలాంటిది ఈ పుస్తకం సోషల్ మీడియాలో వైరల్ కావడాన్ని పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు.




## హజ్ సీజన్ కోసం వీసాల జారీ షురూ : సౌదీ

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది హజ్ సీజన్ కోసం ఫిబ్రవరి 8 నుంచి వీసాల జారీ ప్రక్రియను ప్రారంభించినట్టు సౌదీ అరేబియాలోని హజ్ మంత్రిత్వ శాఖ, ఉమ్రా అధికారులు వెల్లడించారు. హజ్ వ్యవహారాల అధికారిక క్యాలెండర్‌ను విడుదల చేసిన అధికారులు, ఆ వెంటనే వీసాల జారీ, యాత్రికుల రిజిస్ట్రేషన్‌ను చేపడుతున్నారు. 2026 హజ్ సీజన్‌కు సంబంధించి యాత్రికుల తొలి బ్యాచ్ ఏప్రిల్ 18 నాటికి చేరుకుంటుందని సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులు భావిస్తున్నారు. యాత్రికుల రాకకు ముందే మౌలిక సదు పాయాలు, సేవలు పూర్తిగా అందుబాటులో ఉండేలా చూసుకోవడాన్ని, నిర్దేశించిన షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.



# ప్రచారానికి తెర..

**పోలింగ్ ఏర్పాట్లపై అధికారుల దృష్టి**

**నేడు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తరలింపు**

మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మైకులు మూగబోయాయి. ఇన్ని రోజులు బహిరంగ ప్రచారం చేసిన అభ్యర్థులు.. ఇప్పుడు అండర్ గ్రౌండ్ ఆపరేషన్లకు తెరలేపారు. ఓట్లను కొల్లగొట్టేందుకు ప్రలోభాలతో రంగంలోకి దిగారు. డబ్బు, మద్యం, చీరలు, తదితర బహుమతులతో ఓటర్ల ఇండ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బుధవారం ఉదయం పోలింగ్ మొదలయ్యే వరకూ వారికీ పాట్లు తప్పవు. మరోవైపు పోలింగ్ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. మంగళవారం డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రితో సాయంత్రానికి సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకుంటారు. వారం రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారంలో ప్రతీ ఓటరును ఐదారుసార్లు కలిసి ఓట్లను అభ్యర్థించారు. చివరి రోజు సోమవారం వార్డుల్లో భారీ ర్యాలీలు నిర్వహించి బలప్రదర్శనలకు దిగారు.



## 7వ వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన టిఆర్పి పార్టీ

**వాస్తవం : పెద్దపల్లి ఆర్సీ:**

పెద్దపల్లి మున్సిపాలిటీలోని 7వ వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థి పోగుల రాజయ్య కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మద్దతు ప్రకటించి వార్డులో గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఆర్పి పార్టీ జిల్లా అధ్యక్షులు కాసీపేట ఉదయ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్,అలాగే ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ హామీలతో కాలం గడుపుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మాటలతో మాత్రమే పాలన కొనసాగిస్తున్న ఈ ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేయకూడదని ప్రజలకు వివరించారు.కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి రావాలంటే కత్తెర గుర్తుకు ఓటు వేసి ఇండిపెండెంట్ అభ్యర్థి పోగుల రాజయ్య కౌన్సిలర్‌గా గెలిపించాలని, అప్పుడు మాత్రమే ప్రజల సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్పి నాయకులు, కార్యకర్తలు,వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో పలు తీర్మానాలు



**వాస్తవం : ముప్కాల్**

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో సోమవారం రోజు ఉదయం సర్పంచ్ కొమ్ముల సాయమ్మ అధ్యక్షతన గ్రామసభ చేపట్టారు.మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి, ఆదాయ వ్యయ ఖర్చులను పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ గ్రామస్తులకు చదివి వినిపించారు.ఇందిరమ్మ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజి పనులు తొందరగా పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరారు.వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, మొరం కుప్పలతో రోడ్లు చదును చేసేలా తీర్మానం చేశారు. పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో సిబ్బందిని కారోబర్, కంప్యూటర్ ఆపరేటర్ ను తీసుకునేలా గ్రామ సభలో తీర్మానం చేశారు. కొద్దిమేర గ్రామసభ రసాభాసగా మారిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామసభ ముగిసింది.కార్యక్రమంలో సెక్రటరీ మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి చిన్నయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడి టీచర్లు, ఐకేపీ, ఆశ వర్కర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.






### ఆర్మీ సైనికులు డాక్టర్ పెరుక రాజుకు

# ఏపిజే అబ్దుల్ కలాం పురస్కారం

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**




రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ సైనికులు, ప్రముఖ జాతీయ కవి, రచయిత, అనువాదకులు డాక్టర్ పెరుక రాజుకి సాహిత్యంలో చేస్తున్న అవిరళ కృషికి గాను ప్రతిష్ఠాత్మకమైన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం పురస్కారానికి ఎంపిక చేశారు. సామాజిక చైతన్యంతో కూడిన శక్తివంతమైన కలంతో డాక్టర్ పెరుక రాజు చేస్తున్న అసాధారణ సాహిత్య ప్రతిభకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. త్యాగరాయ గాన సభ హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్రదర్శకులు, నిర్మాత జి విజయ కుమార్, సుప్రీం కోర్టు జడ్జి బూరుగుల మధుసుధన్, భారత కళా క్షేత్రం నిర్వాహకులు డాక్టర్ రంజిత్, నటి లక్ష్మి, డాక్టర్ వి బి వసంతరాయలు, స్నేహిత్, విద్యా, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు. భారత ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి హోదాలో విధులు నిర్వర్తిస్తు విరామ సమయంలో రచనలు చేస్తు జాతీయ కవిగా, రచయితగా, అనువాదకుడిగా డాక్టర్ పెరుక రాజు పేరొందారు.

# తారురోడ్డుకు మోక్షం

## ‘వాస్తవం’ దినపత్రిక వార్తకు స్పందన

**వాస్తవం : వేములవాడ**



వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్‌స్టాండ్ నుండి చెక్కపల్లి చౌరస్తా వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారి గుంతలమయంగా మారింది.పట్టణంతో పాటు పరిసర గ్రామం నుండి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురికాగా “వాస్తవం” దినపత్రికలో వార్త ప్రచురితం కాగా, అపూర్వ స్పందన లభించింది. పట్టణంలోని వేములవాడ కోరుట్ల బస్టాండ్ కమాన్ నుండి చెక్కపల్లి తెలంగాణ తల్లి విగ్రహ వరకు ఉన్న 600 మీటర్ల తారు రోడ్డుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేయించారు. ప్రజల అవస్థలను చూసి సదరు కాంట్రాక్టర్ తక్షణం పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించిన మేరకు తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డబల్ తారు రోడ్డుకు ఒకవైపు తారు రోడ్డు పూర్తికాగా మరోవైపు తారు రోడ్డు పనులు చేయిస్తున్నారు. మహాశివరాత్రి జాతర మహోత్సవం సమీపిస్తుండగా పూర్తిస్థాయి తారు రోడ్డు పూర్తి అయ్యేలా శ్రద్ధతో పనులు చేస్తున్నారు. గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డుకు తారు రోడ్డు వేస్తుండగా పట్టణంతోపాటు, పరిసర ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. “వాస్తవం” దినపత్రికను అభినందించారు.



## వేములవాడలో రోడ్డు గుంతలమయం

శివరాత్రికి ముస్తాబయ్యేనా

వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుండి తెలం గాణ తల్లి విగ్రహం వరకు పోయే దారి వచ్చే మార్గం పూర్తిగా గతుకులు గుంతలమయంతో చాలా చోట్ల ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ గుంతులు పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వాస్తవంలో వచ్చిన కథనానికి స్పందించిన అధి కారులు కంకర చూర్ణం వేసి గుంతలు పూడ్చడంతో అది కాస్త మళ్లీ యధావిధిగా గుంతలమయంగా తయార యింది. మరి కొన్ని రోజుల్లో మహాశివరాత్రి జాతర మూడు రోజులు జరుగుతుంది. దీనికి అత్యధికంగా కో రుట్ల, నిజామాబాద్, ఆదిలాబాద్ ,నిర్మల్, ప్రాంతాల నుండి వాహనాల్లో వస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారంగా తారు రోడ్డుతో గతుకులు గుంతలు పూడ్చి వాహనదారులకు భక్తులకు సౌకర్యంగా తయారు చేయాలని కోరారు.

వాస్తవం

# మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

**వాస్తవం:ధర్మసాగర్:** ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలోని పురాతన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో ఈ నెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ ట్రస్టు పాలక మండలి సభ్యులు మండల స్థాయి అధికారులను కలసి ఉత్సవాలకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ధర్మసాగర్ మండల ఎంపీడీవో కె. అనిల్ కుమార్,తహశీల్దార్ పి. సదానందం,సీఐ కె. శ్రీధర్ రావు, ఎస్ఐ నరసింహరావులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్ విజ్ఞప్తి చేయగా,సీఐ శ్రీధర్ రావు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళపల్లి కుమారస్వామి, పంచాయితీ కార్యదర్శి ఆకారపు సురేష్ కుమార్,ఆలయ పునర్ వ్యవస్థాపక ఛైర్మన్ శివసాని ప్రవీణ్





రవీంద్ర,ప్రధాన కార్యదర్శి గుంటిపల్లి సంపత్ కుమార్,కమిటీ సహాయకులు సులుగూరి రాజు,చామల మహేందర్ రెడ్డి, ఏతిరాజుల మల్లయ్య,తాళ్ళపల్లి గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ఆర్జి 3,ఓసిపి 2 ఫిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్**

**వాస్తవం : రామగిరి**



రామగిరి మండలం ఓసిపి2 ఫిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జేఏసీ సమావేశంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని,విద్యుత్ సవరణ చట్టం-2025, విబి జీ-రామ్ జీ చట్టం,విత్తన సవరణ బిల్లు,ఎల్బిసిలో 100% విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించాలని,కార్మిక,ప్రజా,రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 2026 ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్ర కార్మికవర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ,కార్మిక సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా నిర్ణయించాయి.కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక,కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకునేలా కార్మిక వర్గం ప్రతిఘటనకు పూనుకోవాలి.లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి. సమ్మెతోనే పాలకవర్గానికి సమాధానం చెప్పాలి.2026 ఫిబ్రవరి 12న "దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె"కు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో రాష్ట్రంలో అన్ని స్థాయిల్లోని అన్ని కార్మిక సంఘాలు,వాటి అనుబంధ యూనియన్లు యావత్ కార్మికులు భాగస్వామ్యం కావాలని కేంద్ర,రాష్ట్ర కార్మిక సంఘాలు కోరుతున్నాయి.ఈ కార్యక్రమంలో ఓసిపి2 పిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్, ఏఐటియూసి జనరల్ సెక్రెటరీ వైవి రావు,టీబీజీకేఎస్ ఆర్జీ 3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగేల్లి సాంబయ్య, సిఐటియూ జాయింట్ సెక్రటరీ దొమ్మేటి కొమురయ్య,ఎంఆర్సి రెడ్డి,సంత్రం సమ్మయ్య,ఉయ్యాలా కుమారస్వామి, ఎల్లంకి రామారావు,గిరవేణి కొమురయ్య,బిక్ష నాయక్,సందేల కుమార్, ఓడేటి చంద్రశేఖర్,బుచ్చన్న,రవి శంకర్, పాశం శ్రీనివాస్ రెడ్డి,మండ సురేష్, పోశం,దేవా శ్రీనివాస్ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో లక్షయాభై వేల రూపాయలు సీజ్

**చెన్నూర్ సి ఐ బన్సీలాల్**



**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

చెన్నూరు మున్సిపల్ 15వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గుర్రం ఉమారాణి శ్రీనివాస్ లకు చెందిన లక్ష యాభై వేల రూపాయల నగదును టౌన్ సీఐ బన్సీలాల్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.ఎన్నికల భాగంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీస్ వారికి వచ్చిన సమాచారం మేరకు స్థానిక ప్రతాప మారుతి హనుమాన్ టెంపుల్ దగ్గర పట్టణానికి చెందిన పడమటింటి శ్రీనివాస్ అనే వ్యాపారిని తనిఖీ చేయగా లక్ష యాభై వేల రూపాయలు లభించడంతో విచారణ చేపట్టిన పోలీసులకు తన మిత్రుడు(గుర్రం శ్రీనివాస్) అవసరం కొరకు డబ్బులు తీసుకువెళ్తున్నట్లు తెలడంతో డబ్బులు స్వాధీనం చేసుకొని ఎన్నికల ప్రత్యేక (ఎఫ్ఎస్టీ) ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందజేశారు. ఎన్నికల దృశ్య ప్రజలు, వ్యాపారులు ఎలాంటి కారణాలు లేకుండా అధిక మొత్తంలో డబ్బులు మరియు లావాదేవీలు చేసినట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేయడం జరుగుతుందని పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు.

# ప్రజల తరఫున కొట్లాడేది ఎర్రజెండానే

- **12 వ వార్డు సిపిఎం అభ్యర్థి బండ్ల స్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలి**
- **సుత్తి, కొడవలి, చుక్క గుర్తుకే ఓటు వేయాలి**
- **మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన సీపీఎం పోరాట చరిత్ర**
- **సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపు**

**వాస్తవం : గజ్వేల్ ఆర్ సి :**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా గజ్వేల్ మున్సిపాలిటీ 12వ వార్డులోని ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల తరఫున నిజాయితీగా కొట్లాడేది ఎర్రజెండా మాత్రమేనని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు డబ్బు సంచులు, వ్యాపారాలు, భూముల కోసమే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. 12వ వార్డు మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలతో కూడిన ప్రాంతమని, ఇక్కడ నిర్వాసితుల సమస్యలు తీవ్రమైనవని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన సీక్రెట్ బ్యాలెట్ పద్ధతి ద్వారా ధనికా, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే నాయకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్న సీపీఎం పార్టీ అభ్యర్థి బండ్ల స్వామికి సుత్తి, కొడవలి, చుక్క గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం సీపీఎం పార్టీ మొదటి నుంచే ఉద్యమాలు నిర్వహించిందని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇల్లు కి ఇల్లు, భూమికి భూమి, ఉపాధి కల్పించిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఈ ఉద్యమాల్లో సీపీఎం నాయకుల పై కేసులు, లాఠీచార్జీలు, జైలు శిక్షలు ఎదుర్కొన్న చరిత్ర సీపీఎంకే ఉందన్నారు. ముంపు గ్రామాల ప్రజలను గజ్వేల్ పట్టణానికి తరలించి ఐదు సంవత్సరాలు గడిచినా ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇప్పటికీ ప్లాట్లు, ఇల్లు రిజిస్ట్రేషన్ జరగలేదని, 18 సంవత్సరాలు దాటిన యువతకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు ప్యాకేజీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీల్లో వైద్య సదుపాయాలు, స్మశానవాటికలు, మౌలిక వసతులు లేక ప్రజలు మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు. ముంపు గ్రామాల పట్ల బీఆర్ఎస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఆ పార్టీ ముఖ్య నాయకులు బాగుపడ్డారని, రైతులు కూలీలు మాత్రం రోడ్డున పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా ముంపు గ్రామాల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుక సీపీఎం మాత్రమేనని, కేరళలో వామపక్ష ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తోందని గుర్తుచేశారు. బండ్ల స్వామి ఒక కార్మికుడిగా, నిజాయితీగల మచ్చలేని నాయకుడిగా ప్రజల మధ్య గుర్తింపు పొందారని తెలిపారు. ఇలాంటి వ్యక్తిని గెలిపిస్తే గజ్వేల్ మున్సిపాలిటీలో ముంపు గ్రామాల సమస్యలు బయటకు వస్తాయని అన్నారు. గతంలో సీపీఎం పోరాటాల ఫలితంగానే మల్లన్నసాగర్ సమస్య జాతీయస్థాయిలో చర్చకు వచ్చిందని పేర్కొన్నారు.అనంతరం సీపీఎం అభ్యర్థి బండ్ల స్వామి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పేదల పక్షాన నిలబడ్డానని, కార్మికుడిగా ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నానని తెలిపారు. కౌన్సిలర్‌గా గెలిపిస్తే ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సభకు సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వేణుగోపాల్, గ్రామ వార్డు మాజీ సభ్యురాలు శ్వేత, బడుగు బలహీన వర్గాల సంఘం రాష్ట్ర నాయకులు కటకం మహేష్, యువజన నాయకులు బండ్ల కిషన్, చందన బోయిన ఆంజనేయులు, మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు స్వామి, వినోద్ కుమార్, మల్లేష్, రాజు, సురేష్, వెంకట్రావు, సంజీవులు, ప్రవీణ్, ఎల్లం, బాబురావు, క్రాంతి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దామరకుంట పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం



**మార్కుక్ : వాస్తవం:**

మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల పాత్రలను స్వీకరించి పాఠశాల నిర్వహణ బాధ్యతలను చేపట్టారు.జిల్లా విద్యాశాఖాధికారిగా గుర్వనీ ప్రణయ్, మండల విద్యాధికారిగా పురం సాయి కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలిగా అప్పాల రసజ్ఞ వ్యవహరించి తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. ఇతర విద్యార్థులు కూడా వివిధ సబ్జెక్టుల విషయాలను బోధిస్తూ తరగతులను నిర్వహించారు. విద్యార్థుల బోధనా పద్ధతులు, నాయకత్వ నైపుణ్యాలు ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఏ. వెంకట రాములు, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పి. బాల్ రెడ్డి, వై. వెంకట్ నరసింహ రెడ్డి, కేశవ రెడ్డి, సుభాష్ చంద్ర, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.



# మోసపూరిత కాంగ్రెస్‌కి ఎన్నికల్లో బుద్ధి చెప్పండి

**420 హామీలు 6 గ్యారెంటీలు ఎమైనవి**
**మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్**



**వాస్తవం:గోదావరిఖని ఆర్సీ**

రేవంత్ రెడ్డి మోసగాడని ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ వారసుడుని మోసపూరిత కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని 420 హామీలు 6 గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం 40,12, 45, డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 420 హామీలు 6 గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు చేసింది ఎమి లేదని అన్నారు.రైతులకు రైతుబంధు మహిళలకు 2500, తులం బంగారం, అవ్వ తాతలకు 4000 పింఛన్లు విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని చెప్పి అన్ని వర్గాలను మోసం చేశాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. కేసీఆర్ ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా లక్ష రూపా యలు ఇచ్చిండు, కానీ ఓట్లు కావాలి కాబట్టి తులం బంగారంతో పాటుగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిందని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రోజుకో అబద్ధం చెబుతూనే ఉన్నాడన్నారు.శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు.. మార్పు కావాలని కాంగ్రెస్ పపూర్తిగా అవాస్త వాలు ప్రచారం చేశారు, ప్రజలు కూడా ఈ అబద్ధపు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి ఇప్పుడు బాధపడుతున్నారు.ఆశపడడం తప్పు కాదు ఆశ పెట్టి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కి మోసం చేయడం తప్పని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఇదే జరుగుతుందని అన్నారు. రామ గుండం కార్పోరేషన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సభ్యులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అభ్యర్థులు దొమ్మేటి వాసు మేకల సమ్మయ్య యాదవ్ బోడ్డు రవీందర్ జయప్రద రాజేందర్ నాయకులు మూల విజయ రెడ్డి గోపు అయులయ్య యాదవ్ నడిపెల్లి మురళీధర్ రావు నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**వాస్తవం: దౌల్తాబాద్:**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని దౌల్తాబాద్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు పేర్కొన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి, భోజనం తయారీ విధానం, వంట సిబ్బంది పరిశుభ్రత, వంట పాత్రలు, నీటి సౌకర్యం తదితర అంశాలను తనిఖీ చేశారు. భోజనంలో ఉపయోగిస్తున్న బియ్యం, కూరగాయలు, పప్పు, నూనె వంటి పదార్థాలు నాణ్యంగా ఉండాలని, పాడైన లేదా తక్కువ నాణ్యత గల పదార్థాలు వాడకూడదని సూచించారు .విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం తప్పనిసరిగా అందించాలని, సమయానికి భోజనం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీజేపీ బైక్ ర్యాలీ



**వాస్తవం : మోత్కూర్**

సోమవారం మోత్కూర్ టౌన్ లోని రాజన్న గూడెం నుండి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చాడా మంజుల రెడ్డి అధ్యక్షతన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు గౌరవ శ్రీ క్రాంతి కుమార్ గారు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీలో భారతీయ జనతా పార్టీ 12 వార్డుల కౌన్సిలర్ నెంబర్లు పాల్గొన్నారు. మొత్కూర్ చెరువు కట్ట వద్ద మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ ఇంచార్జ్ సమతా, మాజీ రైల్వే బోర్డు మెంబర్ నాగార్జున్ రెడ్డి , కురకుల వెంకటేశ్వరరావు, అబ్బాయ , జిల్లా నాయకులు గౌర్ శ్రీనివాస్ , పోచం సోమయ్య సీనియర్ నాయకులు సజ్జనం మనోహర్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండా గద్దె కూల్చివేతపై మండిపాటు



**జైపూర్:వాస్తవం :** ఇందారం గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా గద్దెను అక్రమంగా కూల్చివేయడాన్ని టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇందారం సర్పంచ్ ఫయాజ్, మంత్రి వివేక్ వెంకటస్వామి పేరును ఉపయోగించుకొని టీడీపీ జెండా గద్దెను కూల్చివేశారని ఆరోపించారు.పార్టీ మారినంత మాత్రాన ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసిన జెండా గద్దెలను కూల్చివేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి మండల స్థాయిలో నిరసనలు చేపడతామని, అదే ప్రదేశంలో తిరిగి టీడీపీ జెండాను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

# భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు

**పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**



**వాస్తవం : గోదావరిఖని ఆర్సీ**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు అనంతర కార్యక్రమాలకు సంబంధించిన అవసర చర్యలు చేపడుతున్నామని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు.సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు,ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను డీసీపీ, గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ అక్కడి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరింత పక్కబందీగా ఏర్పాటు చేయాలని సూచనలు అందించారు. బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్‌లతో పాటు,పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో వాటి భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు,ఆర్మ్ గార్డులు,సైన్ ఫ్లెక్సీలు, కౌంటింగ్ సమయంలో ఎవరికీ అనుమతి ఇవ్వాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు,పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి పోటీలు దోహదం



**జిఎం గోపాల్ రెడ్డి**

**వాస్తవం : రాజేంద్రనగర్**

విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికి తీసేందుకు మాస్టర్ ఒరేటరీ పోటీలు దోహదపడతాయని నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ సిబిఎస్ఈ స్కూల్స్ ఆధ్వర్యంలో మాస్టర్ ఒరేటరీ కాంపిటీషన్‌లు జరుగుతున్నాయి. సోమవారం రాజేంద్రనగర్ కిస్మత్పూర్ బ్రాంచ్ పాఠశాలలో జరిగిన ఈ పోటీలను జిఎం గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులలో వాక్చాతుర్యం, విశ్లేషణాత్మక ఆలోచనను వెలికితీయడమే మా లక్ష్యమన్నారు. స్వీయ భావవ్యక్తీకరణను పెంపొందించడానికి ప్రతిభా పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే వ్యాసరచన, ఉపన్యాస పోటీలు జరిగాయన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రైమరీ విద్యార్థులు మొదటి భవ్యసాయి, జస్విత మొదటి బహుమతి గెలుపొందారు. రెండవ బహుమతి సాయి సిద్ధార్థ నందన్ అందుకున్నారు. హై స్కూల్ విద్యార్థులు సబిహా, శ్రీరామ్ సిద్ధార్థ్ మొదటి బహుమతి అందుకోగా రెండవ బహుమతిని నిధి, శ్రీజ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిత్ రాజ్, డాక్టర్ ఆర్. రవికుమార్, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జే. సురేష్, కోఆర్డినేటర్ జ్యోతిరావు, అకాడమిక్ డీన్ తులసి, వైస్ ప్రిన్సిపల్ రమ్య, ఏఓ మనోజ్ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# పాతాళంలో దాక్కున్నా వదలం

**(మొదటి పేజీతరువాయి)**

తీస్‌మార్ ఖాన్‌లా చెప్తున్నడు' అని దుయ్యబట్టారు. 'తెలంగాణ ముఖ్యమంత్రి పేరు అనుముల రేవంత్‌రెడ్డి కాదు లాగుల తొండల్‌రెడ్డి' అని కేటీఆర్ దెప్పిపొడిచారు. హామీల గురించి అడిగితే లాగుల తొండలు విడుస్తానంటడు. ఫిబ్రవరి 9 వచ్చింది.. రైతుబంధు ఏమైందని గట్టిగా అడిగితే నీ లాగుల తొండలు విడిచిపెడుతానంటడు. తులం బంగారం ఏమైందంటే నీ గుడ్లు పీకి గోటీలాడుతా నంటడు. ప్రతి నెలా రూ. 2,500 ఇస్తానన్నావు ఏమైందంటే నీ పేగులు తీసి మెడలో వేసుకుంటా అంటడని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తాడంటా.. అధికారం ఎవరికీ సొంతం కాదు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఆయన తరం కాదు' అని కేటీఆర్ తేల్చిచెప్పారు. 'హింసించే పులకేశి సినిమాలాగా ఇంకా రెండేండ్లు రేవంత్‌రెడ్డిని భరించాలి. రెండేండ్ల తర్వాత మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే. నీ టైమింకా రెండేండ్లే. ఎంత మంది దేవుండ్లున్నారో మొక్కుకో.. నువ్వు పాతాళంలో దాక్కున్నా సరే.. ఇక నీకు ఉంటుంది! కేసీఆర్‌ను, కార్యకర్తలను ఏమైనా అంటే విడిచి పెట్టం. ఇక్కడున్న పోలీసు అధికారులకు కూడా చెప్తున్నం. సర్కార్ ఎవరి అయ్య సొత్తు కాదు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అతి చేయొద్దు. సీఎం చెప్పిండని అమాయకులైన మా నాయకులు, కార్యకర్తలను ముట్టుకుంటే విడిచిపెట్టం. తప్పకుండా వెంటపడుతం. మేం తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చినం. రోష మున్నోళ్లం. కాంగ్రెస్ తప్పుడు హామీలపై నిలదీస్తం. బరాబర్ గల్లా పట్టి అడుగుతం. 420 హామీల అమలు కోసం కొట్లాడుతం. ఆడబిడ్డలకు ఇస్తామన్న నెలకు రూ.2500 ఎప్పుడిస్తవని అడుగుతం. రూ.4 వేల పింఛన్, తులం బంగారం ఇవ్వకపోతే వీపు చింతపండు చేస్తం' అని హెచ్చరించారు.'రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఎక్కడున్నడు? సమైక్యవాది చంద్రబాబు సంకలో ఉన్నడు. సింగరేణి కార్మికులు బొగ్గు తీయడం మానేసి ఐదు రాష్ట్రాల్లో కరెంట్ ఆగిపోయేందుకు కారణమైనప్పుడు రేవంత్‌రెడ్డి ఎక్కడున్నడు? ఆ రోజు చంద్రబాబు అమ్మిన సంచులు పట్టుకొని ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బ్రోకర్ పనులు చేస్తుండేటోడు. ఇప్పుడు వచ్చి కేసీఆర్‌ను తిడుతున్నడు. రేవంత్‌రెడ్డీ.. నువ్వు లక్కీ డ్రాలో సీఎం అయినవ్. ఐదేండ్లు నడుపుకోలేక కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదు' అని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ తెలంగాణ తెచ్చిన పార్టీ.. గరీబోళ్ల పార్టీ.. పదేండ్లు తెలంగాణను అగ్రభాగాన నిలిపిన పార్టీ.. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి' అని కేటీఆర్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఓట్లను కొనుగోలు చేస్తూ అడ్డంగా దొరికిపోయిన రేవంత్‌రెడ్డి శిక్ష నుంచి తప్పించుకునేందుకు హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను కాలబెట్టాడని కేటీఆర్ విమర్శించారు. ఓటుకు నోటు కేసులో రూ.50 లక్షలతో దొరికిన రేవంత్‌రెడ్డి ఈ కేసు ఆధారాలున్న హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి అగ్గిపెట్టాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. సాక్ష్యాలు లేకుండా మొత్తం ఆ



ఫైళ్లన్నీ బూడిద చేశాడని తెలిపారు. జైలుకు పోకుండా కాపాడుకునేందుకు ఇలా చేశాడని వివరించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకట రమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, బానోత్ శంకర్ నాయక్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-మంత్రి వివేక్ వెంకటస్వామి-**

**వాస్తవం, మందమర్రి ఫిబ్రవరి 9:**



అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీకి రెండు కాళ్ళు వంటివని రెండింటి సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర గనులు కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కేతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ, అన్ని వార్డులు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే పట్టణ అభివృద్ధి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పట్టణ ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ చేపట్టి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ఎమ్మెల్యే బాల్క సుమన్ ఒక్కసారైనా వార్డుల్లో పర్యటించాడా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ చిన్న కొడుకునని చెప్పుకుంటూ బాల్క సుమన్ చెన్నూరు నియోజకవర్గాన్ని పట్టించు కోలేదని, అక్రమంగా భూ దందాలు,ఇసుక మాఫియాను పెంచి పోషించి వేలాది కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించుకున్నారని విమర్శించారు.తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మౌలిక వసతులపై దృష్టి సారించానని, నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు ఒక్క నిరుపేద కుటుంబానికి ఇవ్వలేదని మండి పడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## అంకుసాపూర్‌లో గుండెపోటుతో వ్యక్తి హఠాన్మరణం

**వాస్తవం:కాటారం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం పరిధిలోని అంకుసాపూర్ గ్రామంకు చెందిన కనకం సారయ్య (45) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు.వివరాల్లోకి వెళితే...నిత్యం వ్యవసాయ పనులు చేస్తూ కష్టపడి కుటుంబాన్ని పోషించే సారయ్య, తన మిత్రులతో కలిసి వంటచెరు కుల నిమిత్తం అడవికి వెళ్లారు. ఈ క్రమంలో అడవిలోనే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతునికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు వికలాంగురాలిగా ఉండి, మంచానికే పరిమితమై ఉండడం కుటుంబాన్ని మరింత విషాదంలోకి నెట్టింది. సారయ్య మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి మృతుని కుటుంబానికి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.




# కాంగ్రెస్ పార్టీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి

**-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ -**

**వాస్తవం, మందమర్రి ఫిబ్రవరి 9:**

రాష్ట్రంలో అమలు గాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టి రెండు సంవత్సరాల పూర్తయిన ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మాజీ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు సం ,, కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు, సింగరేణి కార్మికులు, అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ 2500,4 వేల పెన్షన్ , డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లు, వంటివి అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. క్యాతనపల్లి లో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని, నియోజక వర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మంత్రి వివేక్ హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయక అవినీతిపాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఆయన తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికలు ఏమైనా కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు .ఈ



కార్యక్రమంలో బిఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గం ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా జర్నలిస్టుల సేవలు




శంకరపట్నం : వాస్తవం

సప్త సమాజంలో నాటి నుండి నేటి వరకు జర్నలిస్టు లు ప్రభుత్వానికి అధికారులకు ప్రజలకు వారధిగా ఉం డి ప్రజా సమస్యను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు అధికారులకు చేరువచేసే నీతి నిజాయితీ నిబద్ధత కూడిన జర్నలిస్టు వృత్తి అని శంకరపట్నం తహసిల్దార్ కే. సురేఖ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు 2026 నూతన డైరీని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం శంకరపట్నం ఐజేయు యూనియన్ అధ్యక్షులు జక్కోజు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సురేఖ డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికి తీసి ప్రభుత్వానికి అధికారులకు ప్రజలకు వారధిగా నిలిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందు ఉంటారని, జర్నలిస్ట్ సేవలను తాసిల్దార్ సురేఖ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు కె రాములు, ప్రత్యూష, శంకరపట్నం వర్కింగ్ జర్నలిస్టులు ఐజేయు యూనియన్ ప్రధాన కార్యదర్శి, మాతంగి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బుర్ర సత్యనారాయణ, గొట్టే అర్జున్, కోశాధికారి మోతే సదానందం, జిల్లా కార్యవర్గ సభ్యులు గాజుల స్వామి, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దండు సమ్మయ్య, కార్యవర్గ సభ్యులు కాశి పాక సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారానికి తెర

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)




రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం తెర పడింది. ప్రచారానికి మైక్‌లకు మూగనోము పడింది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల బుధవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల ప్రచారాలకు తెర పడింది. ఎలక్షన్ కోడ్ ప్రకారం గుంపులు గుంపులుగా ఎన్నికల ప్రచారాలు నిర్వహించడానికి ఆంక్షలు విధించారు. బుధవారం నిర్వహించే ఎన్నికలకు మంగళవారం సాయంత్రం బ్రాందీ షాపులు బంద్ చేయించనున్నారు. అలాగే శుక్రవారం నిర్వహించే మున్సిపోల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహించనుండగా బ్రాండ్ షాపులు బంద్ చేయనున్నారు. ఎన్నికలకు కౌంట్ డౌన్‌లోకి చేరడంతో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కెకె మహేందర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిని గోపి మున్సిపల్ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ అభ్యర్థుల గెలుపు కోసం బిఆర్ ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంఛార్జి చల్మడ లక్ష్మీనరసింహారావు అభ్యర్థుల గెలుపు కోసం గడపగడప ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి తెరపడగా, వార్డుల అభ్యర్థులు ఓటర్లను కలుస్తు ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ధోబీఘాట్‌కు పూర్వవైభవం

వాస్తవం : రాజేంద్రనగర్



ఎమ్మెల్యే చొరవతో అన్యాక్రాంతమవుతున్న ధోబీఘాట్ కు పూర్వ వైభవం వచ్చిందని అత్తాపూర్ శ్రీరామ వాషర్ మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు (రజక సంఘం) హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసిన రజక సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లర్ నెంబర్ 164 పెద్ద తాళ్లకుంట వద్ద ఉన్న రజక సంఘం కు సంబంధించిన ధోభీ ఘాట్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికై జోనల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు కొండమీది నర్సింగ్ రావు, కోశాధికారి ఎర్రోళ్ల మహేష్, ఎర్ర శివశంకర్, ఎర్రోళ్ల అశోక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో
# చిట్టిబాబు ఇంటింటి ప్రచారం



వాస్తవం : అందోల్

అందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని 14,15,17,వార్డులలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకుల చిట్టిబాబు చివరి రోజు సోమవారం నాడు ముమ్మర ప్రచారం చేశారు. మూడు వార్డులలో ఆయన ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే మున్సిపల్ అభివృద్ధి చెందిందని వాడ వాడలో సిసి రోడ్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. మా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులతో ఇంకా మున్సిపల్ను బొమ్మరిల్లుగా తయారు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఓటర్ మహాశయులను కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో
# మద్యం దుకాణాలు బంద్

ఆబ్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ

వాస్తవం : రామగుండం రూరల్



పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా మద్యం దుకాణాలు బందు చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా రామగుండం ఎక్సైజ్ ఆబ్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ మాట్లాడుతూ రామగుండం మున్సి పాల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కో య శ్రీహర్ష ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 నుండి 11 వ తేదీ ఎన్నికల పోలింగ్ మూసే వరకు నగరపాలక పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని, ఒకవేళ ఎన్నికల కోడ్‌నుఉల్లంఘించి మద్యం విక్రయాలు కొనసాగించినట్లయితే వారిపై చట్టపరంగా శిక్ష విధించబడునని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని రామగుండం ఎక్సైజ్ ఆబ్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ తెలిపారు.

# మందమర్రిలో గుప్పుమంటున్న గంజాయి

**దొరికిన వాళ్ళనే పడుతున్నారు, దాని మూలాలపై నిఘా పెడుతున్నారా? లేదా అంటున్న పట్టణ ప్రజలు**

**యువకులను ఊరిస్తూ..బతుకులను సిద్రం చేస్తున్న గంజాయి**

**మందమర్రి ఎస్సై జి. నరేష్ కేసును దర్యాప్తు**

వాస్తవం : మందమర్రి

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో.. సోమవారం మధ్యాహ్నం సమయంలో.. మందమర్రి పోలీసులకి వచ్చిన నమ్మదగిన సమాచారంతో.. మందమర్రి అంగడి బజార్ శివాలయం ఏరియా దారిలో రెక్కి నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ సమీరుద్దీన్ అలియాస్ సమీర్ సన్నాఫ్ ,యూసఫ్ ఉద్దీన్ , వయసు: 21 సం, నివాసం: అంగడి బజార్, మందమర్రిలో అరెస్టు చేశారు. మందమర్రి ఎస్సై జి. నరేష్ నేరస్తుని వద్ద నుంచి 165 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని పంచుల సమక్షంలో.. పంచనామా నిర్వహించి తదుపరిచర్యకై నేరస్థున్ని అదుపులోనికి తీసుకున్నారు . అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆపరేషన్లో మందమర్రి పోలీస్ అదేవిధంగా మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఫిబ్రవరి 11న వేతనంతో కూడిన సెలవు మంజూరు

**జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష**

**దుకాణ,వ్యాపార,వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**

**వాస్తవం : పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**



పెద్దపల్లి జిల్లాలోని దుకాణ,వాణిజ్యసంస్థల యజమానులకు,వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి 11 బుధవారం రోజున మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ,వ్యాపార,వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనం తో కూడిన సెలవు మంజూరు చేయాలని అన్నారు.ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని,పోలింగ్ జరిగే సమయంలో షిఫ్ట్‌లో ఉన్న ఉద్యోగులకు,ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సిబ్బందికి కూడా తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారము యజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని,లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకొబడతాయని కలెక్టర్ తెలిపారు.

## పోలింగ్ సిబ్బంది
# మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది మూడో విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు.జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి,నోడల్ అధికారి భారతి,ఈడీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**మహా శివరాత్రి జాతర నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, వేములవాడ మున్సిపల్, శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అధికారులతో సమీక్ష**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ నుపలు జోన్లుగా పారిశుధ్య పనుల నిర్వహణకు వేములవాడ మున్సిపల్,శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అధికారులు.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించి.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం అవగాహన,శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా,జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు.ఈ నెల 14 వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణాన్ని 20 జోన్ లుగా విభజించి ప్రతి జోనుకు ఒక పంచాయతీ కార్యదర్శిని ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించి.. వారికి సిబ్బంది, శానిటేషన్ పరికరాలు ఇస్తామని తెలిపారు. వీరు అందరు ఈ నెల 13 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు వేములవాడలో సేవలు అందించాలని సూచించారు. పార్కింగ్,ఇతర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. జాతర ప్రదేశాల్లో స్వచ్ఛంగా.. పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పారిశుధ్య పనులు చాలా కీలకమని, అందరు సమన్వయం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు.ఈ సమావేశంలో డీఆర్ డీఓ గీత, డీపీఓ షరీఫుద్దిన్,పాల్గొన్నారు.






# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

**మంథని మున్సిపల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తాం**

**వాస్తవం : మంథని**

మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు కావడంతో మంథనిలోని శ్రీపాదరావు విగ్రహం నుండి అంబేద్కర్ చౌక్ వరకు రోడ్ షో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరుపేద కుటుంబాలకు అందజేస్తూ ముందుకు వెళ్తుందని ఎక్కడ కూడా అవినీతి జరగకుండా నేరుగా పేదలకు చేరవేస్తున్నామని రానున్న రోజులలో మరింత మంథని పట్టణాన్ని అభివృద్ధి చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మంథని నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చామని అన్నారు.ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ 13 మంది అభ్యర్థులను గెలిపించడం ద్వారా మంథని పట్టణ అభివృద్ధి జరుగుతుందని పనిచేసే వారికే ఓటు వేయాలని కోరడం జరిగింది.ప్రతిపక్షాలకు ఓటు వేయడం వృధా అని తెలిపారు.ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.కుట్టుమిషన్ల ద్వారా మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు.ఇప్పటికే మంథని మున్సిపల్ కార్యాలయం సంబంధించినటువంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి,దరఖాస్తుదారులు ఎవరైనా వచ్చిన వెంటనే దరఖాస్తుకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి వారికి త్వరితగతిన విచారణ చేసి పనులు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ప్రతి ఒక్కరికి వైద్యం అందాలనే ఉద్దేశంతో మంథనిలో ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంజరిగిందని,ఎంపీడీవో ఆఫీస్ దగ్గర్లో నూతన 50 పడకల ఆసుపత్రికి నిర్మాణ పనులు జరుగుతున్నాయని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.కాబట్టి రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్న అభ్యర్థులను గెలిపించుకొని మన మంథని పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రతి ఒక్కరూ చేతి గుర్తు పై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ 13 వార్డుల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 13 వార్డులకు సంబంధించిన మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,మహిళా నాయకులు,కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.







# ప్రజా ప్రభుత్వంలో వితంతు-వృద్ధాప్య పింఛన్ల జాడెక్కడ?

**గత మూడున్నర సంవత్సరాలుగా**
**పింఛన్ల స్కీం బందు చేసిన ప్రభుత్వాలు**
**కాంగ్రెస్ పాలనలో వృద్ధులు,వితంతువులు లేరా**
**ఉండకూడదనే అభిప్రాయమా**
**వితంతు, వృద్ధాప్య పింఛన్లు బంద్ చేసి,**
**మహిళలకు భరోసా కల్పిస్తారా?**



**వాస్తవం : మందమర్రి :**
మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ,మున్సిపాలిటీ అదేవిధంగా..మండలంలోని తదితర గ్రామాలలో నివసిస్తున్న వృద్ధులకు, వితంతువులకు గత బీఆర్ఎస్ పార్టీ అదేవిధంగా.. నేడు ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలకులు,ప్రభుత్వంమూడున్నర సంవత్సరాలుగా..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల స్కీమును రద్దు చేసి,వారి ఆదరణ లేని అభాగ్యుల ఆశలపై నీళ్లు చల్లారు.భర్తలు చనిపోయి భార్యలు,కాటికి కాలుజాపి కొందరు,ప్రభుత్వ పింఛన్ల కోసం పడిగాపులు కాస్తు..ఊరికి వచ్చిన అధికారులందరినీ,నాయకులని ప్రాధేయ పడుతున్నారు.వారి బాధ వర్ణాతీతం.బతుకు బారమైన వారి కళ్ళల్లో ఆనందాన్ని దూరం చేసి,వితంతువుల ఉసురు పోసుకుంటారా..?మీరు ఇస్తానన్న స్కీమును ఆపేసి ,కొత్త స్కీములు ఎందుకు ప్రారంభిస్తున్నారో అర్థం కాని పరిస్థితి దాపురించిందంటూ ఆవేదన చెందుతున్నారు. ఐదు సంవత్సరాల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి ప్రారంభించినట్లు చేసి,ఈ స్కీమును పూర్తిగా బందు పెట్టింది.గత ప్రభుత్వం బందు పెట్టిన రేషన్ కార్డుల స్కీమును ఈ ప్రభుత్వం ప్రారంభించింది కదా.. అలానే వితంతు,వృద్ధుల పింఛన్ స్కీమును కూడా ప్రారంభించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందంటున్నారు.కేవలం భర్తకు ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్వస్తూ.. అతడు మరణిస్తే ఆయన స్థానంలో వాళ్ల భార్యకు పింఛన్ అందిస్తున్నారు.దీన్ని (ఫౌస్ )అంటారు కానీ.. కొత్త వాళ్లకు ఎవ్వరికీ గత మూడున్నర సంవత్సరాలుగా పింఛన్ ఇవ్వటం లేదు.రాష్ట్రమంతటా..ఇదే తంతు నడుస్తుంది.పాలకులు,అధికారులు మాత్రం అందరికీ పింఛన్ ఇస్తున్నామంటూ..ఈ అభాగ్యుల సమస్యను దాట వేస్తున్నారు.ఇప్పటికైనా..ప్రజా ప్రభుత్వంగా..చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలకులు వితంతు ,వృద్ధప్య పింఛన్లపై సమాలోచన చేసుకొని, కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో కుమిలిపోతూ.. చిన్న ఆశతో కొద్దో- గొప్పో ఆర్థికంగా ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురుచూస్తున్నారు, నా అనే వాళ్ళు లేకున్నా..అనాధలను ఆదుకోవడానికి కాంగ్రెస్ అభయ హస్తం ఇస్తుందని దీనమైన కళ్ళతో లక్షలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

## కోనపూరి లక్ష్మమ్మకు ఘన నివాళి



వలిగొండ : వాస్తవం
మాజీ మావోయిస్టు నాయకులు, బి ఆర్ ఎస్ పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు సాంబశివుడు,ఆయన సోదరుడు కోనపూరి రాములు మాతృమూర్తి కోనపూరి లక్ష్మమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు.సోమవారం మండలంలోని దాసిరెడ్డిగూడెంలో నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం పాల్గొని లక్ష్మమ్మ మృత దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిశీచి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సుక్క రామనర్సయ్య ఆధ్వర్యం లో కళాకారులు ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకు సుధాకర్, క్రాంతిదళ్ పృధ్వీ,కంచర్ల రామకృష్ణారెడ్డి,మొగుళ్ళ శ్రీనివాస్, శీలం స్వామి,బెల్లి చంద్రశేఖర్,కావాలి యాదయ్య, అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్,వేముల పుష్పక్క, ప్రజా సంఘాల నాయకులు,విప్లవ ఉద్యమ సానుభూతిపరులు,పడమటి దామోదర్ రెడ్డి,తుమ్మల వెంకటరెడ్డి,కొమురెల్లి సంజీవరెడ్డి,పేరుమాండ్ల యాదగిరి, పడమటి మమత నరేందర్ రెడ్డి,కోనపురి కవిత, స్వర్ణలత, నారి మల్లేష్, నారీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం**
**పెద్దపల్లి మున్సిపల్పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం**
**త్వరలో పెద్దపల్లిలో ఐటీ పార్కు, ఆటోనగర్ ఏర్పాటు**
**రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,**
**పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట**
**విజయరమణా రావు**




వాస్తవం, పెద్దపల్లి ఆర్ సీ;
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు అధ్యక్షతన సోమవారం రోజున నిర్వహించిన యుద్ధ భేరి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతోపాటు అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.గూడులేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆశ్రయం కల్పించినట్లు పేర్కొన్నారు. నిరుపేదలకు త్వరలోనే ఇంటి స్థలాలను కేటాయించి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో త్వరలోనే ఐటీ పార్కు ఏర్పాటు చేయబోతున్నట్లు, ఆటో కార్మికుల కోసం ఆటో నగర్ నిర్మాణానికి స్థల సేకరణ కూడా చే స్తున్నామని ప్రకటించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ మంజూరులో పెద్దపల్లి అగ్ర స్థానంలో నిలిచిందని, అందుకు స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు కృషి ఫలితమేనన్నారు. రూ. కోటితో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ కోచింగ్ సెంటర్ భవన నిర్మాణం. అత్యాధునిక ఎకర్యాలతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన రైతులందరికి రూ. 2లక్షల రుణ మాఫీ అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి పెద్దపల్లి పట్టణ ప్రజలు అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రమణా రావు మాట్లాడుతూ..పెద్దపల్లి పట్టణాభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మరో రూ.22 కోట్లు మంజూరు చె యించామని గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరిగెత్తిస్తున్నట్లు వివరించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో 36 మంది కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత ప్రజలదేనన్నిప ట్టణాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్దపల్లి నియోజకవర్గానికి నిధుల ప్రవాహాన్ని తెప్పిస్తానని చెప్పారు.ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే పారదర్శకంగా జవాబుదారితనంతో ప్రజలకు సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు. -పట్టణాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎన్నికల ఇన్చార్జి,మాజీ ప్రజాప్రతినిధులు,కౌన్సిలర్ అభ్యర్థులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు, పలు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు బయటపెట్టాలి

### దేశ రైతాంగం కార్మిక వర్గాన్ని కాపాడాలి
### సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు

వాస్తవం : గజ్వేల్ ఆర్ సి



అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు పార్ల మెంట్లో బయటపెట్టాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలో భాగంగా గజ్వేల్ పట్టణంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడం జరుగుతుందని విమర్శించారు. అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల దిగుమతుల సుంకం పూర్తిస్థాయిలో తొలగించిందని దీంతో ఆపిల్ రైతులకు మార్కెట్లో ధర లేదని అదేవిధంగా పత్తి కొనుగోలు కూడా ఆన్లైన్ చేయడం ధరను తగ్గించడం జరిగిందని అన్నారు. దేశంలో ఒకపక్క వ్యవసాయ రంగం దివాలా తీస్తుంటే దేశ కార్మిక,రైతాంగాన్ని తాకట్టు పెట్టడం జరిగిందని అన్నారు. రష్యాతో చమురు ఒప్పందం రద్దు చేసుకోవాలని అమెరికా ఒత్తిడి చేసిందని తెలిపారు. దీంతో భారతదేశం పైన ఆర్థిక,సాంస్కృతిక ప్రభావం ఉంటుందని అన్నారు. భారత మిలిటరీ వ్యవస్థ పై,రక్షణ రంగంలో ప్రైవేటీకరణ వల్ల దేశ భద్రతకు ప్రమాదం పొంచి ఉందని,దేశ అంతర్గత సమాచారం బయటకు వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. దేశ ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా 12న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులతో పాటు రైతాంగం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య,రంగారెడ్డి,స్వామి, నాగరాజు, మల్లేష్,రాజు,సంజీవులు,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలలో ర్యాంపులు వీల్ చైర్స్ ఏర్పాటు చేయండి

### బొడ్డు శంకర్

వాస్తవం : మాడుగుల



మాడ్గుల మండలంలోని తహసీల్దార్,ఎంపిడిఓ కార్యాలయల్లో ర్యాంపు లు,వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలని వికలాంగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శంకర్ అన్నారు. సోమవారం మాడ్గులలో విలేకర్ల తో మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు ఏదైనా పను ల కోసం కాని లేదా అధికారులకు సమస్యలు చెప్పుకో వడానికి కార్యాలయాలకు వచ్చినప్పుడు ర్యాంపులు, వీల్ చైర్స్ లేకపోవడంతో కార్యాలయాలలోని వివిధ గదుల లోకి తిరుగడానికి చాలా ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వికలాంగులు, వృద్ధుల సౌకర్యార్థం మాడ్గుల మండలంలోని తహసీల్దార్,ఎంపిడిఓ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయల్లో ర్యాంపులు ఏర్పాటుచేసి, వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని బొడ్డు శంకర్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు యాచారం సత్య నారాయణ గౌడ్,కార్యదర్శి ఎమ్మె గణేష్ పాల్గొన్నారు.

# గడ్డి మందు మేసి 6 గొర్రెల మృతి

### 55కు చికిత్స..రూ.60 వేల ఆస్తి నష్టం
### పశువైద్యులు అందుబాటులో లేకపోవడమే కారణమంటూ ఆరోపణలు

మర్కుక్ : వాస్తవం



మండల కేంద్రమైన మర్కుక్‌లో సోమవారం గడ్డి మందు (పెస్టిసైడ్) పిచికారీ చేసిన మేత మేసిన కారణంగా గొర్రెలు విషప్రయోగానికి గురైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందగా,55 గొర్రెలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. సుమారు రూ.60 వేల మేర ఆస్తి నష్టం జరిగింది. మండల కేంద్రానికి చెందిన అయ్యన్నగారి కరుణాకర్ తన గొర్రెల మందను సమీప వ్యవసాయ పొలానికి మేతకు తీసుకెళ్లగా, ఇటీవల రసాయనాలు పిచికారీ చేసిన గడ్డి మేయడంతో కొద్దిసేపటికి గొర్రెలు ఒక్కసారిగా కూలిపోవడం ప్రారంభించాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పశువైద్య అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన పశువైద్యులు డా.రమేష్,డా.శిరీష సంఘటనా స్థలానికి చేరుకుని 55 గొర్రెలకు అత్యవసర చికిత్స అందించారు. అయినప్పటికీ తీవ్రంగా ప్రభావితమైన ఆరు గొర్రెలు మృతి చెందాయి. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనాలు పిచికారీ చేసిన తర్వాత కనీసం రెండు మూడు రోజుల పాటు పశువులను ఆ ప్రాంతంలో మేతకు వదలకూడదని రైతులకు సూచించారు. అప్రమత్తత లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే,పశు వైద్య సిబ్బంది తక్షణం అందుబాటులో లేకపోవడమే నష్టం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నష్టపోయిన కాపరి కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.







# అతివేగం, అజాగ్రత్తతో అమాయకుడి ప్రాణం బలి

### పది నిమిషాల క్రితం అందర్నీ పలకరించి,రోడెక్కుడుతోనే బలైపోయాడంటు రోదనలు,
### మందమర్రి ఎస్సై జి నరేష్ కేసు దర్యాప్తు

వాస్తవం : మందమర్రి

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రమాద పూర్తి వివరాల్లోకి వెళితే.తేదీ 09 02 26 అనగా.. సోమవారం ఉదయం మందమర్రి జాతీయ రహదారి శివారులోని బురదగూడెం సమీపంలోని గాంధారి మైసమ్మ వైన్స్ ఎదురుగా ఉదయం 6 గంటల 10 నిమిషాలు సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భీమారం నివాసుడైన భూక్య భాస్కర్ మందమర్రి టోల్ గేట్ దగ్గర 15 ఎకరాల పత్తి చేను కౌలుకు చేస్తున్నాడు. పత్తిని తీపించడం కోసమని భాస్కర్ తన భార్యతో కలిసి భీమారం నుండి ఆదివారం సోముగూడెంలోని తన అత్తగారింటికి వచ్చాడు. ఈరోజు ఉదయం అందాజా 5:30 గంటల సమయంలో పత్తి తీసేందుకు కూలీలను మాట్లాడడానికి తన ద్విచక్ర వాహనం టీఎస్ 19 బి 5212 పై సోమగూడెం నుండి మేదారం వైపుకు వెళ్తుండగా..బెల్లంపల్లి నుండి మంచిర్యాల వైపుకు అతివేగంగా,అజాగ్రత్తగా,నిర్లక్ష్యంగా వెళుతున్న టీఎస్ 02 ఈ.ఆర్ 3300 హ్యుందై వెర్నా కారు, వెనుక నుండి బైకును ఢీకొట్టడంతో బైక్ మీద ఉన్న భాస్కర్ కిందపడి తలకు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు .విషయం తెలిసిన మందమరి ఎస్సై జి .నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సంబంధితులకు రోడ్డు ప్రమాదం గురించి తెలుపగా మృతుడి భార్య అయిన భూక్య పద్మ ఫిర్యాదు ఇవ్వగా.. మందమర్రి ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసుకొని శవంపై పంచనామా నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నారు.





# ఆర్థిక అవగాహన పెంపొందించాలి

### జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారంసందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా సంప్రదింపుల కమిటీ సభ్యుల సమక్షంలోజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ...జనాభాలోని వివిధ వర్గాలలో ఆర్థిక అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారాన్ని అమలు చేస్తుందని వివరించారు. ఈ నెల 9 నుంచి 13 వరకు కేవైసీ – సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు అనే థీమ్‌తో పాటించాలని ప్రతిపాదించారని తెలిపారు. నో యువర్ కస్టమర్, కేవైసీ సంబంధిత మోసాలు,మనీ మ్యూలింగ్ కు వ్యతిరేకంగా జాగ్రత్తలతో సహా, ఖాతా క్రమశిక్షణను పాటించడం, ప్రజలలో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమన్వయంతో జిల్లా స్థాయిలో అనేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఆర్ బిఐ, బ్యాంకులు ఎప్పుడూ మెయిల్‌లు, ఎస్ఎంఎస్ లు పంపడు లేదా బ్యాంక్ ఖాతా వివరాలు,పాస్‌వర్డ్‌లు మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని అడిగే కాల్‌లు చేయదని స్పష్టం చేశారు.వివిధ సోషల్ మీడియాల ద్వారా మొబైల్ ఫోన్లకు వచ్చే ఆఫర్లు,లింకులు,ఫోన్లకు స్పందించ వద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు,వివిధ బ్యాంకుల మేనేజర్లు,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

### ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

వాస్తవం : సిరిసిల్ల



ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా తరలిస్తున్న మధ్యాన్ని సిరిసిల్ల పోలీసులు సోమవారం పట్టుకున్నారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని సిరిసిల్ల పట్టణ సిఐ కె కృష్ణ హెచ్చరించారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం మేరకు సిరిసిల్లలోని పెద్దురుకి వెళ్ళగా నిందితుడు గడ్డం కిషన్ అనే వ్యక్తి సోమవారం రూ.19,478.5 విలువైన మద్యం సీసాలను పట్టుకొని 8వ వార్డ్ ఓటర్లకు పంచడానికి వెళుతున్నడని,ఈ మద్యం సీసాలు 8వ వార్డ్ నుండి బిజెపి పార్టీ తరుపున పోటీ చేస్తున్న జంగిటి పుష్ప భర్త జంగిటి దేవయ్య ఓటర్లకు పంచుటకి మద్యం సీసాలను అమ్మనగా తీసుక వెల్తున్నని చెప్పగా పంచుల సమక్షంలో మద్యం సీసాలను,స్వాదినం చేసుకొని నిందితుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించనైనదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు,మద్యం,ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# బిజెపితోనే పట్టణ అభివృద్ధి

### వార్డు అభ్యర్థి ప్రచారంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

వాస్తవం: సిరిసిల్ల





సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా పట్టణ కేంద్రంలో బిజెపి బలపరిచిన 34వ వార్డు అభ్యర్థి మారుపాక శ్రీధర్ సోమవారం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి బీజేపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి హాజరై అభ్యర్థి గుర్తు కమలం గుర్తు ప్రజలందరు కమలం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు ఇంఛార్జి ఆవునూరు గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి, ఉప సర్పంచ్ నక్కల రాజు, ముస్తాబాద్ మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు పొన్నాల సత్యం రెడ్డి,శక్తి కేంద్ర ఇంచార్జి కట్కం మహేష్,బూత్ అధ్యక్షులు ఆంద్రపు శివ, ప్యారం అజిత్, పాతూరి భాస్కర్, కర్రోల నవీన్, ముస్తాబాద్ మండల సోషల్ మీడియా కో కన్వీనర్ ధను,సీనియర్ నాయకులు బద్ది చంద్ర రెడ్డి, కాసారపు రవి,గంగాడి,లక్ష్మణ్,మంత్రి అవినాష్,పిట్ల నరేష్,నక్కదాసరి ప్రశాంత్,గంగాడి,శ్రీకాంత్,కాసారపు శ్యామ్,అఖిలేష్,నవీన్,బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

### అభ్యర్థుల గెలుపునకు

## ఆది శ్రీనివాస్ విస్తృత ప్రచారం



వాస్తవం : వేములవాడ

మున్సిపోల్స్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిస్తుండగా..వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుల గెలుపు కోసం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది గల్లీ గల్లీలో గడపగడపన ఎన్నికల ప్రచార కార్యక్రమంనిర్వహించారు.వేములవాడ పట్టణంలోని 1,2 వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మద్దతుగా ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.వేములవాడ పట్టణంలోని 17,26,27 వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మద్దతుగా ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

### ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను

## పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



వాస్తవం : సిరిసిల్ల

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లాఅదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు.సిరిసిల్ల పట్టణం గీతానగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సోమవారం ఆర్ డిఓలు వెంకటేశ్వర్లు,రాధాభాయ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.ఈ పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా,సంపత్ కుమార్,తహసీల్దార్లు మహేష్ కుమార్,జయంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రిక

## అందజేసిన ఆలయ ఈవో



వాస్తవం : వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర సందర్భంగా, సోమవారం హైదరాబాద్ లోని దేవాదాయ ధర్మదాయ కమిషనర్ హరీష్, కి అధికారికంగా ఆలయ ముఖ్య కార్యాచరణ అధికారి ఎల్ రమాదేవి ఆహ్వాన పత్రిక అందజేశారు.అనంతరం ఆలయ అర్చకులు,వేద పండితులు స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.మహాశివరాత్రి జాతర నిర్వహణపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకొని, వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ**

**రాజన్న సిరిసిల్లజిల్లా ఎస్పీ మహేష్ బిగితే**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయంచేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బిగితే మాట్లాడుతూ....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా,ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని,పోలీస్ అధికారులు,సిబ్బంది పోలీస్ స్టేషన్కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,వినతులు, ఫిర్యాదులు స్వీకరించి,అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా,నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.



## నాచారం డివిజన్లో

# అభివృద్ధి పనులకు శ్రీకారం



**వాస్తవం : ఉప్పల్**

నాచారం డివిజన్లో 4 కోట్ల 66 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,హెచ్ఎంటి నగర్లో 70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన,నాచారం డివిజన్ హెచ్ఎంటి నగర్ డివిజన్ లో సమానంగా అభివృద్ధి తెలిపారు.అనంతరం హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,హెచ్ ఎంటి నగర్ పెద్ద చెరువును సందర్శించారు. హెచ్ ఎంటి నగర్ పెద్ద చెరువును రూ, 30 కోట్లలతో సుందరీకరణ తో తద్వారా నాచారంలో దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ సూరజ్ వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్,నాచారంలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు,బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం కప్లో దౌల్తాబాద్ ఆదర్శ విద్యార్థుల విజయం

**వాస్తవం : దౌల్తాబాద్**

దుబ్బాక నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్--2026 క్రీడా పోటీల్లో దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ఘన విజయం సాధించారు. దుబ్బాకలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో ఖో--ఖో బాలుర విభాగంలో ఆదర్శ పాఠశాల జట్టు ప్రథమ బహుమతి సాధించి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.ఈ పోటీల్లో అనేక పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొనగా, దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల జట్టు చురుకైన ఆటతీరుతో ప్రత్యర్థి జట్లను ఓడించి విజేతగా నిలిచింది.విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ నాగమణి,ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. ఈ విజయానికి ముఖ్యంగా కృషి చేసిన పీడీ సురేష్ను అభినందించారు. విద్యార్థులను క్రమశిక్షణతో శిక్షణ ఇచ్చి, క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా మార్గనిర్దేశం చేసినందుకు ఆయన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ,క్రీడలు విద్యార్థుల శారీరక,మానసిక వికాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు,జట్టు భావన పెరుగుతాయని తెలిపారు.ఆదర్శ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతూ పాఠశాల ప్రతిష్ఠను పెంచుతున్నారని హర్షం వ్యక్తం చేశారు.వైస్ ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసే మంచి అవకాశమని అన్నారు.భవిష్యత్తులో జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటాలని ఆకాంక్షించారు.మరింత కష్టపడి శిక్షణ పొందితే రాష్ట్ర స్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




రెండు తెలుగు రాష్ట్రాల్లో అశేష పాఠకాదరణ పొందిన
వాస్తవం డిజిటల్ పత్రిక
ఆర్ఎన్ఐ అనుమతులున్న
జనోదయ ప్రింట్ పత్రికలకు
రాజకీయ,
ఆర్థిక,సామాజిక,సాహిత్య
వ్యాసాలతోపాటు
ఇతర వార్తల కవరేజీ
సమాచారాన్ని పంపడానికి
ఆహ్వానం
8074124190
9618616110




మానసాని కృష్ణా రెడ్డి
వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు
Manasani Krishna Reddy

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

**ఉప్పల్ జోనల్ కమిషనర్కి వినతి పత్రం**

**మేడిపల్లి : వాస్తవం**



జిహెచ్ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ కి ప్రజా పాలన లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భగా రచ్చ కిషన్ మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో గత కొంత కాలంగా అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేవడుతున్న నిర్మాణాల వల్ల ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆదాయాన్ని కోల్పోతుంది. వాటిపై మా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు నెలల నుండి 11 సార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం వాటిలో ఒక్క ఫిర్యాదుపైన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొంత మంది అధికార పార్టీ నేతలు, మరి కొంత మంది మాజీ కార్పొరేటర్లు, అధికారుల కనుసన్నల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వారు స్వాహా చేస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయం గురించి బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. దీంతో మీ దృష్టికి తీసుకుని వస్తున్నామని మీరైన ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నాను. ఈ ఫిర్యాదుతోపాటు గతంలో మా పార్టీ తరువున చేసిన 11 ఫిర్యాదుల కాపీలను జత చేస్తున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి,ఏఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ దండు రమేష్,బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే ప్రమీల, బికేఎమ్ఎఫ్ మండల అధ్యక్షులు ఐలయ్య కార్యదర్శి కే మహాలక్ష్మి,మండల కౌన్సిల్ సభ్యులు నర్సమ్మ పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో
# ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**మున్సిపల్ కార్పొరేషన్2026 ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ భద్రత ఏర్పాట్లు**

**ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎటువంటి ర్యాలీలు, సభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదు**

**గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్.ప్రసాదరావు**

వాస్తవం : గోదావరిఖని ఆర్సీ

మున్సిపల్ కార్పొరేషన్ఎన్నికల సందర్భంగా ప్రజలు భయభ్రాంతులకు లోను కాకుండా,స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు యంత్రాంగం పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు .గోదావరిఖని టూ టౌన్ సి.ఐ ఎస్. ప్రసాదరావు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు చెక్‌పోస్టులు, వీడియో సర్వైలెన్స్ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరంపర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు.ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అక్రమ మద్యం కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై పోలీస్ నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించినా, డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.తేదీ:09.02.2026 సోమవారం 05:00 గంటలకు ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని నిక్కచ్చిగా అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎటువంటి ర్యాలీలు, సభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలు ఎన్నికల నియమావళిని గౌరవించి శాంతియుత ఎన్నికలకు సహకరించాలని కోరారు.ప్రచారానికి బయటి నుంచి వచ్చిన వ్యక్తులు సోమవారం సాయంత్రం ఐదు గంటలలోపు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని




ఖాళీ చేసి వెళ్లాల్సింది గా ఆదేశిస్తున్నాం. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓటర్లు ఉత్సాహంగా ముందుగానే పోలింగ్ స్టేషన్ చేరుకొని వాళ్ళ ఓటు హక్కు వినియోగించు కోవాల్సిందిగా పట్టణ వాసులందరికీ తెలియజేశారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**అఖిలపక్ష కార్మిక సంఘాల బైకు ర్యాలీ**

వాస్తవం : ఉప్పల్

ఫిబ్రవరి 12న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ,కార్మిక సంఘాలు ఐఎన్ టి యుసి,సిఐటియు,ఏఐటీయూసీ,టియు సిఐ, నాయకులు ఉప్పల్ పారిశ్రామిక వాడలో సోమవారం బైక్ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాసే ప్రయత్నం చేస్తోందని, రాజ్యాంగ బద్ధ, ప్రజాస్వామ్య బద్ధ హక్కుగా కార్మికుల సమ్మె చేసే హక్కును కాల రాస్తుందని,కార్మికులు తమ సమస్యలు పరిష్కారానికి కార్మిక వివాదాల చట్టం ద్వారా లేబర్ ఆఫీస్ కి వెళ్లి న్యాయం పొందే ప్రయోజనాన్ని కూడా రద్దు చేసిందన్నారు.కార్మిక వర్గం పెద్ద ఎత్తున లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఉద్యమించాలని కోరారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక చర్యలపై విధానాలపై పోరాడాల్సిన బాధ్యత కర్తవ్యం కార్మిక వర్గంపై ఉందని అన్నారు. విత్తన చట్టం పేరుతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేసే బిల్లుని ఆమోదింపచేయడం, కనీసం 26,000 ఇవ్వాలని ఫిక్స్ టర్మ్ కాం



ట్రాక్టు వ్యవస్థను పర్మినెంట్గా కొనసాగించి కార్మికులు యజమానులు ఊడిగం చేసే సేవకులుగా మార్చే చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు.ఒకవైపు కార్మికులు తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్ చేస్తుండగా,ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేసే ప్రయత్నాలు తిప్పికొట్టాలని,కార్మికులు ఫిబ్రవరి 12 న జరుగుదేశ వ్యాప్త సమ్మెలో అధిక మొత్తంలో కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎన్ టి యుసి నాయకులు ప్రకాష్ రెడ్డి, సిఐటియు నాయకులు జోంకన్న,వెం కటేష్,ఊర్మిళ, స్వామి, వై వెంకటేశ్వర్లు,అంజి ,సయ్యద్, జిలాని, ఏఐటీయూసీ నాయకులు పరమేష్, జగ్గారెడ్డి,బి. ఆర్. టి.యు నాయకులు సైదులు,టియు సిఐ నాయ కులు గడ్డంసదానందం,అఫ్జల్,యాకస్వామి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు కుటీర పరిశ్రమల వైపు మొగ్గు చూపాలి

**మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**ఎన్నికల ప్రచారంలో మంత్రి**

వాస్తవం : అందోల్

అందోల్ జోగిపేట మహిళా అభివృద్ధికి కృషి చేస్తానని వారు ఇప్పటినుండే కుటిర పరిశ్రమల వైపు దృష్టిసారించాలని దాని కోసం నేను తనవంతు సహాయం చేస్తానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 2,3,10,వార్డులో ఆయన ప్రచారం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమ మేధా శక్తితో ఎన్నో పరిశ్రమలు ఏర్పాటుకు దృష్టిసాగించాలన్నారు.పదవ వార్డులో ఏ సమస్య ఉన్న ప్రవీణ్ దిష్టి తీసుకెళ్తే తమ దృష్టికి తీసుకు వస్తారని తెలిపారు. అలాగే ఆయా వార్డులలోని నాయకుల దృష్టికి తీసుకువస్తే తన దృష్టికి తెస్తారన్నారు, ఇప్పటికే వార్డులో ఇందిరమ్మ ఇల్లు మరమ్మతులు నడుస్తున్నాయని ఇంకా అర్హులైన వారికి



జాగా ఉంటే ఇండ్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.ఇంకా వచ్చే మూడేళ్లలో జోగిపేట ను బొమ్మరిల్లుగా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మార్కు ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నాయకులు పట్లోళ్ల ప్రవీణ్, గూడెం మల్లయ్య సురోత్తం రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో**

## కాంగ్రెస్ విస్తృత ప్రచారం



మేడిపల్లి : వాస్తవం

మేడ్చల్ నియోజకవర్గం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 7వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీకాంత్ నాయక్ కి మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక ప్రజలను కలుసుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని,మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవసరమని అన్నారు. ప్రజలు ఇచ్చే మద్దతే పార్టీకి బలం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబెర్ జైపాల్ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అశేష పాఠకాదరణ పొందిన వాస్తవం డిజిటల్ పత్రిక ఆర్ఎన్ఐ అనుమతులున్న జనోదయ ప్రింట్ పత్రికలకు
రాజకీయ, ఆర్థిక,సామాజిక,సాహిత్య వ్యాసాలతోపాటు ఇతర వార్తల కవరేజీ సమాచారాన్ని పంపడానికి
ఆహ్వానం
8074124190
9618616110
జనోదయ
వాస్తవం
మానసాని కృష్ణా రెడ్డి
వాస్తవం,జనోదయ
తెలుగు దినపత్రికల
ప్రధాన సంపాదకులు
Manasani Krishna Reddy
రేవంత్‌కు వేమూరి దప్పు

# దేవుడికి దండంపెడితే అది వార్తనా?



.....

కే.ఆర్ 'శైలి' పాత్రికేయ పాఠశాల
పాఠం : 10.02.2026

..............................................

పత్రికల్లో అక్షర దోషాలు సర్వ సాధారణమై పోయాయి. ప్రతి పదాన్ని విలేకర్లు తప్పుగానే రాస్తున్నారు. దీనికి కారణం విలేకర్లు పేపర్ వర్క్ చేయకపోవడమే. తాము రాసే వార్తను ఒకటికి పదిసార్లు చదివి తాము పాఠకుడిగా ఉన్నామనుకుని సంబంధిత వార్తపై సంతృప్తి చెందిన తర్వాతనే ప్రచురణకు పంపించాలి. అయితే వార్తల విషయంలో ఈ శ్రమను మెజార్టీ పాత్రికేయులు పెట్టడం లేదు. దీంతో ఎక్కడ చూసినా అక్షర దోషాలే కన్పిస్తున్నాయి. పైగా మారుతున్న కాలంలో పాత్రికేయులు క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా ఎవరో రాసుకున్న వాట్సాప్ సందేశాన్ని వార్త అంటూ పత్రికలకు పంపిస్తూ తాను విలేకరినంటూ చెలామణి అవుతున్నారు. దీంతో వార్త నిర్మాణంలో సరియైన లీడ్,శీర్షిక, వాక్య నిర్మాణం సక్రమంగా లేకపోవడంతోపాటు అన్ని అక్షర దోషాలే ఉంటున్నాయి. ఉదాహరణకు ఎక్కడ ఒత్తు ఉండాలో, ఎక్కడ దీర్ఘం ఉండాలో తెలియడం లేదు.దీంతో సంబంధిత వార్తలను ప్రచురిస్తున్న పత్రికల ప్రతిష్ఠ మసకబారుతోంది.అందుకే పాత్రికేయులకు జర్నలిజంలో శిక్షణ తప్పనిసరి.రాజకీయ,ఆర్థిక,సామాజిక అంశాల మీద విలేకర్లకు అవగాహన ఉండాలి.భాష మీద పట్టు ఉండాలి. ఏది వార్త? ఏది వార్త కాదు ? అని జర్నలిస్టులకు తెలిసి ఉండాలి.కానీ నేడు వివిధ పత్రికల్లో అన్ని అంశాలు వార్తలే అయిపోతున్నాయి. నేతలు దేవుని గుడిలో కొబ్బరికాయ కొడితే అది వార్తగా మారిపోతున్నది..జన్మదిన వేడుకలు ఎవరు జరుపుకున్నా అది పెద్ద వార్తగా మారిపోతోంది.వివాహ వేడకల్లో పాల్గొంటే అది అంతకన్నా పెద్ద సంచలన వార్తగా పాత్రికేయులు గుర్తిస్తున్నారు.ఇలా ఒకటేమిటి అన్నీ వార్తలే.ఏది ప్రజాప్రయోజనం? ఏది స్వప్రయోజనం? అనే అంశాన్నే పాత్రికేయులు పట్టించుకోకపోవడంతో పత్రికలన్నీ వివాహ వేడుకలు, జన్మదినోత్సవాలు,బియ్యం పంపిణీలు, వాహనాల తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్‌ల వార్తలతోనే పత్రికలు నిండిపోతున్నాయి.దీంతో సామాన్యుల బతుకు చిత్రాలకు తావే లేకుండా పోయింది. వాహనాలను తనిఖీ చేయడం, ట్రాఫిక్‌ను క్రమపద్ధతిలో మళ్ళించే విధులు ట్రాఫిక్ పోలీసులు నిర్వర్తిస్తారు. అసలు వారిని ఉద్యోగులుగా నియమించింది ఇలాంటి విధులను చేపట్టడానికే..మరి అలాంటప్పుడు 'వాహనాలను తనిఖీ చేసిన శామీర్‌పేట ట్రాఫిక్ పోలీసులు' అని తాటికాయంత శీర్షికలతో వార్తలు రాయడం ఎందుకు? అది వారి డ్యూటీనే కదా? ఒకవేళ వాహనాలను తనిఖీ చేయకుండా నిర్లక్ష్యంగా ఉంటే అది వార్త? ఎందుకుంటే వాహనాలను తనిఖీ చేయకపోవడంతో గంజాయి సరఫరా, ఇసుక అక్రమ రవాణావంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది కావున ఆ విషయాన్ని వార్తగా విలేకరి గుర్తించగలగాలి. అలాగే తరగతి గదిలో పాఠ్యాంశాలు బోధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, దేవాలయంలో పూజలు చేసిన పూజారి ఇలా ఎన్నో సర్వసాధారణ విషయాలను వార్తలంటూ పత్రికల్లో ప్రాధాన్యత ఇవ్వడం పరిపాటిగా మారిపోయింది. అదే విధంగా అక్షర దోషాలతో వార్తలను పంపిస్తే అర్థం పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉన్నది.

ఉదాహరణకు...నెల రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు విధులకు హాజరు కాకుండా సమ్మె బాట పట్టారు. అనంతరం వారితో ప్రభుత్వం చేపట్టిన చర్చలు విజయవంతం అయి వారు విధుల్లోకి తిరిగి చేరిపోయారు. ఈ విషయాన్ని వార్తగా రాయాలనుకున్న విలేకరి అవసరం లేని చోట ఒక చిన్న దీర్ఘం పెట్టడంతో అర్థమే మారిపోయింది.

## 'వీధుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు'

ఈ శీర్షికన విలేకరి వార్త రాశారు. విధుల్లో అని రాయడానికి బదులు వీధుల్లో అని రాస్తే ఆ వార్త అర్థమే మారిపోయింది. అంతకు ముందు సరియైన వేతనాలు లేక తమ విధులకు హాజరుకాకుండా సమ్మె బాట పట్టి వీధుల్లో తమ నిరసన తెలిపారు. అప్పుడు పెట్టాల్సిన శీర్షిక అనంతరం విధుల్లో చేరిన తర్వాత 'వీధుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు' అని దీర్ఘం పెట్టడంతో అర్థమే మారిపోయింది. అదేవిధంగా పంచాయతీకి, పంచాయితీకి తేడా తెలియక వార్త రాయడంతో సంబంధిత వార్త అర్థమే మారిపోతుంటుంది.గ్రామ పంచాయతీకి బదులుగా గ్రామ పంచాయితీ అని రాస్తున్నారు.పంచాయితీ అంటే గొడవ అనే అర్థం వస్తుంది. అర్ధం అంటే సగం అని అర్థం. ఇక అర్థం అంటే మీనింగ్. ఈ రెండింటి మధ్య తేడా తెలియకుండా వార్తలు వాడితే వాటి అర్థమే మారిపోతుంది. కక్ష అంటే పగ.కక్ష్య అంటే గ్రహాలు తిరిగే గమనాలను కక్ష్య అంటారు. ఈ రెండింటి మధ్య తేడా తెలియక పదాలను వాడితే వాటి అర్థమే మారిపోతుంది.ఇలా ఎన్నో పదాలు చిన్న ఒత్తులు,దీర్ఘాలు,పొట్టలో చుక్కలతో వాటి అర్థాలే మారపోతుంటాయి. ఇలాంటి విషయాల మీద విలేకర్లు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి.

## సరళ పదాలు వాడాలి

చాలామంది విలేకర్లు కృత పదాలు వాడుతున్నారు. వాటికి బదులుగా సరళంగా ఉండే పదాలను వాడాలి. ఉదాహరణకు పాముకాటుకు గురై అని రాస్తున్నారు.గురై అనే పదం అవసరం లేదు..పాము కాటుతో అని రాస్తే సరిపోతుంది. దాడికి పాల్పడిన అనే పదం రాస్తున్నారు. పాల్పడిన అవసరం లేదు..దాడి చేసిన అని రాస్తే సరిపోతుంది.చర్యలు గైకొని అని రాస్తుంటారు. గైకొని అని రాయరాదు. చర్యలు తీసుకుని అని రాస్తే సరిపోతుంది.ఆందోళనకు గురై అని రాస్తుంటారు. గురై అనే పదం అవసరం లేదు..ఆందోళనతో అని రాస్తే సరళంగా ఉంటుంది. అలాగే ఏడాది కాలంగా అని రాస్తుంటారు..ఏడాదిగా అని రాస్తే తేలిగ్గా ఉంటుంది. పరిష్కరించడానికి అని రాస్తుంటారు. పరిష్కారానికి అని రాస్తే పాఠకుడికి చదవడానికి వీలుగా ఉంటుంది. విద్యార్థినివిద్యార్థులు అని చాలామంది పాత్రికేయులు రాస్తుంటారు.. విద్యార్థులు అంటే సరిపోతుంది. ప్రదానోత్సవ కార్యక్రమం అని రాస్తుంటారు.. ప్రదానోత్సవం అని రాస్తే సరిపోతుంది. అదేవిధంగా బహుమతి ప్రదానం బదులుగా బహుమతి ప్రధానం అని రాస్తున్నారు. ఇక్కడ ప్రధానం అంటే ముఖ్యమైనది. ప్రదానం అంటే దానం చేయడం. ఒక ఒత్తుతో అర్థమే మారిపోతుంది. విదితమే అని రాస్తుంటారు. విదితమే అని రాయడం కన్నా తెలిసిందే అంటే సరళంగా ఉంటుంది.తదుపరి అని రాయడం కన్నా తర్వాత అని రాస్తే బాగుంటుంది.

## పునరుక్తులు ఎందుకు?

వివాహిత మహిళ అనే బదులు వివాహిత అంటే సరిపోతుంది. గర్భిణీ స్త్రీ అనే బదులు గర్భిణి అనాలి.మైనర్ బాలిక అనడం ఎందుకు? బాలిక అంటే సరిపోతుంది. కట్టుకున్న భర్త, కట్టుకున్న భార్య అని రాస్తుంటారు. కట్టుకోవడం ఎందుకు? భార్య, భర్త అని రాస్తే సరిపోతుంది కదా? గాయపడ్డ క్షతగాత్రులు అని రాస్తుంటారు. క్షతగాత్రులు అంటే సరిపోతుంది కదా? రోడ్డుపై రాస్తారోకో అని వాడుతుంటారు.రోడ్డు అన్నా రాస్తా అన్నా ఒకటే కదా? రాస్తారోకో అంటే సరిపోతుంది. గెలుపొందిన విజేతలు అని వాడే బదులు విజేతలు అన్నా గెలుపొందడం అన్నా ఒకటే కదా? విజేతలు అంటే అర్థం అదే కదా? ఇలా ఒకటా రెండా ఎన్నో విషయాలు ఉన్నాయి. వీటన్నింటి మీద తర్వాతి వ్యాసాల్లో విపులంగా తెలుసుకుందాం.

......................

**మానసాని కృష్ణారెడ్డి**
**9618616110**
**8074124190**

..........................................

మరో అంశంతో మరో వ్యాసంలో..

..........................................

నోట్ : పాత్రికేయ పాఠశాలలో పరోక్ష తరగతుల ద్వారా పాత్రికేయులకు శిక్షణ కోర్సులు ఉన్నాయి.

## కాపీ పేస్ట్ వార్తలతో గంగలో కలుస్తున్న పత్రికల పరువు

**నీ అక్షరం అజరామరం**

చూడు..చూడు
పేదల బతుకులు
అవి కూలుతున్న గోడలు
తెగిన గాలిపటాలు
రాయి..రాయి..అవే రాయి
ప్రతి ఇంటా చీకటే
ప్రతి కంటా కన్నీరే
నీ అక్షరం అజరామరం
నీ గమనం రేపటి సూర్యోదయం

కె.ఆర్




# 'సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..

## పశ్చిమబెంగాల్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్

పశ్చిమబెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' ప్రిక్రియను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తామే కల్పించుకుంటామని స్పష్టం చేసింది. అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని సూచించింది.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కోసం 300 మంది అధికారులను కేటాయించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే 80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడంలేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొన్నది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది.సర్ ప్రక్రియవల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించు కోవ డానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకా శమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజే సింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడ



ిగిస్తున్నట్లు వెల్లడించింది.